# చిత్రలేఖ

"దయచేసి తలుపులు మూయండి... ప్లీజ్ క్లోజ్ ది డోర్స్..... థ్యాంక్యూ.... దయచేసి తలుపులుమూయండి...ప్లీజ్‌క్లోజ్‌దిడోర్స్...థాంక్యూ...." నాలుగో అంతస్థులో తననోరు తెరవగానే లిఫ్టు మాట్లాడడం మొదలుపెట్టేసింది. తెల్లటి వెంట్రుకలున్న తెల్లటి దుస్తుల నల్లటి ముసలాయన, నెగటివ్ ఫిల్మ్‌లోంచీ దిగివస్తున్న వ్యక్తిలా లిఫ్టునోటిలోంచీ బయటికి వచ్చాడు. తలగోక్కుంటూ నాలుగు వందలా మూడో నెంబరు తలుపుల ముందుకొచ్చి ముద్దాయిలా నిల్చున్నాడు. ఫ్లాటు తలుపుల్ని విడిపోకుండా వెనక్కు నెడుతూన్న బావురుకప్పతాళం లంకిణిలా అతణ్ణి వెక్కిరించింది.

తూర్పు వైపునుంచీ నాలుగు ఫ్లాట్లూ, పడమటి వైపు నుంచీ నాలుగు ఫ్లాట్లూ అదుపులేని కొవ్వులా ముందుకు పెరగడంతో, మధ్యలో మిగిలిన పాసేజ్ అని పిలవబడే నడవా రక్తనాళంలా సన్నబడిపోతోంది. నడవా వుత్తరపు చివర్లోని పొడవాటి కిటికిలో యేడు కొండల శిఖరపు శకలమూ, దక్షిణపుకిటికీలో తెల్లమేఘాల్ని వేలాడేసుకున్న ఆకాశపు పేలికా తగులుకుని వున్నాయి. నడవాకు రెండువైపులావున్న అపార్టుమెంట్ల తలుపులన్నీ బ్యాంకులాకరు డబ్బాల్లా వరసగా పొందిగ్గా సర్దుకుపోయివున్నాయి. సొరంగాల గుహలో దారితప్పిన ముసలి జింకలా దిక్కుతోచకుండా నిల్చున్న ముసలాయిన కళ్ళల్లో, నీళ్ళు తిరగసాగాయి. నిట్టూరుస్తూ అతను పక్క అపార్టుమెంటు కేసిపాకుతున్నట్టుగా సాగి, నాలుగు వందలా రెండో తలుపుల పక్కన దాక్కున్న కాలింగ్‌బెల్‌ను ప్రాధేయపడ్డాడు.

మీట కొంచెమైన కాలింగ్ బెల్ కూత ఘనంగా లిఫ్టుగొంతును యెగతాళిచేసింది. అది రెండోసారి లిఫ్టును వేళాకోళం చేశాక నాలుగువందలా రెండో తలుపుల మధ్యలోంచీ వో ఆడతల ముందుకొచ్చింది. "యెవరండీ? యెవరు? యెవరుకావాలి?"

"అమ్మా! నేను... నేను యెవరంటే...?" ముసలాయన ముసలిగొంతువణికింది.

"లిఫ్టులోంచీ వచ్చింది మీరేనా? బయటికిరాగానే దానిగొంతునొక్కాలని గూడా తెలియదా మీకు?" ఆమె తనకోపాన్ని తారస్థాయిలో మీటింది.

ముసలాయిన కాళ్లీడ్చుకుంటూ లిఫ్టుదగ్గరికి పరిగెత్తాడు.

"మాఆయన క్లయింట్లను యింట్లో కలవరు.. ఆఫీసులోనే కలుసుకో... వెళ్ళెళ్ళు..." తలుపులరెక్కల్ని పీపుకతికించుకున్న యువతి తన తలను లోపలికి లాక్కోబోయింది.

"అమ్మాతల్లా! అప్పుడే వెళ్ళిపోవద్దు... నేను నన్నూటమూడు వోనర్ని .. మీ పక్క అపార్టుమెంటునాదే!" ముసలాయిన లిఫ్టు పెదవుల్ని మూయిస్తూ అక్కడి నుంచే ఘోషించాడు.

యువతి తల విసుగ్గా యివతలకి తిరిగింది.

"నా నన్నూటమూడును నేనొక ఆడమనిషికి రెంటుకిచ్చినా నమ్మా! ఆమె అదేందో ఆఫీసులో అదేందో వుద్యోగంచేస్తా వుండానని చెప్పింది. నాలుగునెలల ముందామె మాయమైపొయ్యింది. యెన్ని సార్లొచ్చి అడుక్కున్నా యీ బీగం జబాబు చెప్పటం లేదు.." ముసలాయిన తన శరీరాన్నంతా వినయపుగుల్లలోకి లాక్కుంటున్నాడు.

"అడ్డమైన ప్రతివాడూ వచ్చి పక్క అపార్టుమెంటు తలుపుల గురించి వాకబు చెయ్యటమే! మేమిక్కడ వుండడమే తప్పన్నట్టుగా యెప్పుడు పడితే అప్పుడు విసిగించడమే! ఆ మాయమయ్యే మనిషికి అద్దెకిచ్చే ముందుగా మమ్మల్నేమైనా సంప్రదించావా నువ్వు? యిప్పుడు నువ్వు కలవాల్సింది పోలీసుల్ని" ఆమె చూపులు కత్తుల్లై అతడ్ని పొడవసాగాయి.

"యింత జరిగినా ఆ పని చెయ్యకుండా వుంటానా తల్లీ!" అతను మరింతగా వినయపుగుల్లలోకి ముడుచుకుపోతూ జవాబు చెప్పాడు. "అయితే వాళ్ళు నేనే ఆమెను మాయంచేసేసుంటానని దబాయించి పారేసినారు. నా అదృష్టం బాగుండి నాదూరపు బంధువొకడు పోలీసినస్పెక్టరుగా వుండాడు. వానికాళ్ళూ చేతూలూ పట్టుకోని అక్కడి నుంచీ తప్పించుకోనొచ్చినాను..."

కింది అంతస్థులోంచీ లిఫ్టు "దయచేసి తలుపులు మూయండి... ప్లీజ్‌క్లోజ్‌దిడోర్స్.. థాంక్యూ ... దయచేసి..." అంటూ నిర్విర్ణంగా హెచ్చరించడం స్పష్టంగా వినవచ్చింది. తన తలను వెనక్కు తిప్పుకోబోయిన యువతి ముసలాయిన చేతులు అడ్డంగా వూపి వేడుకోవడంతో ఆగి లిఫ్టుకేసి వురిమిచూసింది. లిఫ్టుగొంతులోంచీ రణగొణ ధ్వనుల్ని పలకరించుకుంటూ పైకొచ్చిన యువకుడు నాలుగో అంతస్థులో అది నోరు తెరవగానే బయటికి విసురుకొచ్చాడు.

పొడవాటి జుబ్బా పై జామాల్లో తన శరీరాన్ని గట్టిగా పొట్లం గట్టించుకున్నట్టుగా కనిపిస్తున్న యువకుడు నడవాలో నిల్చున్న ముసలాయినను పట్టించుకోకుండా సరాసరి నన్నూట మూడు ముందుకెళ్ళి, దాని తాళాన్ని చూపులతోనే పలకరించబోయాడు. యెంతకూ జవాబు చెప్పని తాళం కప్పకేసి చికాకుగా చూశాక, పక్కకు తిరిగి, నన్నూట రెండు తలుపుల మధ్యలోంచీ తన చీకాకును పరావర్తనం చేస్తున్న పక్కింటావిడ తలను చూసి, వీలయినంత ప్రసన్నంగా నవ్వడానికి ప్రయత్నిస్తూ "యీ ఫోర్నాట్ త్రీ..." అంటూ అతక్కుపోయిన తన పెదవులకు నాలుకతో తడి అద్దసాగాడు.

"యీ ఫోర్నాట్ త్రీ గురించి చెప్పడానికేనా మేమీ పక్క అపార్ట్‌మెంటులో వుంటున్నది.. పోపో.." అని రుసరుసలాడుతూ పక్కింటావిడతల తలుపులను ముందుకు లాక్కోబోయింది.

"మేడమ్! మేడమ్! ఆగండాగండి! నేను మీ హజ్బెండు దగ్గర్నించీ రెకమెండేషనుతో వస్తున్నాను.." అంటూ జుబ్బా యువకుడు ముందుకు దూకాడు.

బొమ్మలా కళ్ళుటపటపలాడిస్తున్న పక్కింటావిడ తలకేసి చూసి దోరగా నవ్వడానకి నటిస్తూ "మా కస్టమరొకడు మీ ఆయన క్లయింటు. పొయిన సంవత్సరం వాడు తీసుకొచ్చిన మటం నేలల కేసులో మీ హజ్బెండుకు నాలుగైదులక్షలదాకా ఫీజు మిగిలిందటలెండి! అమాదిరికేసులు యింకో రెండింటిని మీ హజ్బెండు దగ్గరికి లాక్కురాబోతున్నాడతను." అన్నాడా యువకుడు.

దారి తప్పిన పావురంలాంటి నవ్వొకటి పక్కింటావిడ ముఖంలోకొచ్చివాల బోయింది.

"నేనొక రచయితన్లెండి!" జుబ్బా యువకుడు అమాంతంగా సిగ్గునటించాడు. "యిప్పుడు నా నవలలు రెండు సీరియల్లుగా వస్తున్నాయి. యీ ఫోర్నాట్‌త్రీ మిస్టరీ గురించిన క్లూలు వెతికి పట్టి వాటితో కొత్త నవలను వండబోతున్నాను. అందుకని.."

"భలే అదృష్టవంతులండీ మీరు! యిదిగోయీ పెద్ద మనిషి ఆ ఫోర్నాట్ త్రీ వోనర్నంటున్నాడు. మీక్కావల్సిన క్లూలన్నీ యీయన జేబులోనే వుంటాయి.. మీరూమీరూ మాట్లాడుకోండి. లోపల నాయిడియట్ బాక్సు నా కొంగు పట్టుకులాగుతోంది" అంటూ పక్కింటావిడతల తలుపుల్ని లాక్కోబోయింది.

"థ్యాంక్యూ మేడమ్! వోనరు తీగదొరికితే దెయ్యం డొంకనంతా వూపి పారేస్తాన్లెండినేను. కానీ దయచేసి రెండు కుర్చీలు తాత్కాలికంగా దానం చేసి వెళ్ళండి. మాప్లాట్లేవో, ఫ్లాట్లేవో మేము పడతాం.." అంటూ జుబ్బా యువకుడు గాండ్రింపును నవ్వుగా మార్చబోయాడు.

నాలుగు వందలో రెండులోంచీ రెండుప్లాస్టిక్ కుర్చీలు నడవాలోకి పడడమూ, దాని తలుపులు మూసుకోవడమూ వొకేసారి జరిగాయి. నాలుగు వందలా నాలుగు ముందు వేలాడుతున్న దిష్టికొబ్బరి మూటను అనుమానంగా చూస్తూ "చిత్రలేఖ మీఫ్లాటులో యెప్పుడుదిగింది? ఆమెకు పిల్లలెందరు? పెళ్ళయ్యిందా? మొగుడున్నాడా? వుంటే యేంచేస్తున్నాడు?" అని ప్రశ్నలతో ముసలాయనను వుక్కిరిబిక్కిరిచేశాడు జుబ్బారచయిత.

"చిత్రలేఖా? ఆమెవురుసార్?" యింటిగల్లాయిన బిత్తర చూపులుచూస్తూ బిక్కమొహం పెట్టాడు.

"మీ అపార్టుమెంటులో బాడుగకుండే మనిషిపేరు చిత్రలేఖని గూడా మీకు తెలియదాసార్!" జుబ్బారచయిత మరింత పెద్దగా డైనోసర్‌నవ్వు నవ్వబోయాడు "ఆమె మా ఆఫీసులోనే మాపక్క సెక్షన్లో పనిచేసేది. రెండు మూడు నెలలుగా జీతం బిల్లుల్లో సంతకం చేయడానికి కూడా ఆమె కనబడకపోయేసరికి ఆఫీసువాళ్ళకు అనుమానం వచ్చింది. ఆమె దగ్గరి నుంచీ ఆర్నెల్ల కోసారి కంతు డబ్బులు తీసుకుపోయే యెల్లయిసీ యేజెంటుకు అనుమానంవచ్చి పోలీసు కంప్లయింటు యిచ్చాడు. పోలీసులు పత్రికల చెవుల్లోవూదారు. అంతే! చిత్రలేఖ కనబడడంలేదనే వార్త రకరకాల అనుమానాలతో బాటూ సెన్సేషనల్ న్యూసయిపోయింది..."

"వాళ్ళ ఆఫీసు యెంప్లాయీ ఐడెంటిఫికేషన్ కార్డునూ, ఆమె బాంకు అకౌంటు పుస్తకాన్నీ చూసినాకే నా నన్నూట మూడునామెకు రెంటుకిచ్చినాను! ఆమెకీ మాదిరిగా మాయమైపోయే గుణముందని ముందుగా తెలుసుకోలేక పొయినాను. పోలీసులుగూడా ఆమె ముందూ వెనకా యేముందో చెప్పలేకపోతావుండారు. న్యూసుపేపర్లు దినానికొక విధంగా ఆమె గురించి కథలు రాస్తావుండాయి." కుర్చీలో కూర్చున్నాక యింటిగల్లాయిన తనతోతాను మాట్లాడుకోసాగాడు.

"అదేనండీ యిప్పుడున్నయిబ్బంది! యెవరి పనులు వాళ్ళు చేస్తే చాలదా? కథలు రాయడానికి మా అంతటి రచయితలం మేంలేమా? మధ్యలో యీజర్నలిస్టులు

మాపనెందుకు చెయ్యాలి చెప్పండి?" జుబ్బారచయిత తన ప్రస్తావనరాగానే అప్రమత్తుడై పోయాడు.

"పంచభూతాల్లో నేలా ఆకాశమూ మనదిగాని మూడు భూతాల అపార్టుమెంటు మనకొద్దురా అంటే నాకొడుకు విన్లేదు.."అతడి మాటల్ని పట్టించుకోకుండా యింటిగల్లాయిన తనస్వగతాన్ని కొనసాగించాడు. "మదనపల్లెకూ వాల్మీకి పురానికీ నడీ మధ్యలో కొండికిందుండే యెర్రెర్రని నేలపైన వాడు అలిగినాడు. దాన్ని అమ్మంగా వచ్చిన దుడ్డుతో యీ నన్నూటమూడును తీసుకోని, దీని బాడిగ వసూలు జేసే పని నాకప్పగించినాడు. యీ బాడిగను నమ్ముకోని హైద్రాబాదులో చీటీలో చేరినాడు. నా అల్లుడు గ్రామీణ బాంకీ మేనేజరు. పదయిదేండ్లుగా తినీతినకా మిగిలించిన దుడ్డుతో క్రిష్ణానగర్లో యాభై అంకణాల తావు సంపాయించినాడు. బాంకీ అప్పు తీసుకోని ఆ తావులో యిల్లుగట్టించే పని నాపైన పెట్టినాడు. ఆపనిలో బడి నేనొక నెల బాంకుకు పోలేదు. బాడిగ దుడ్డు జమకాలేదని తెలస్తానే యీ రెసిడెన్సీకి పరిగెత్తుకోనొచ్చినాను. యీ బీగమప్పుటి నుంచీ నన్నేమారిస్తానే వుండాది."

"వొకప్పుడు యీ బాలాజీకాలనీలో యిండ్లు యిలావుండేవిగావండీ అపార్టుమెంటు వోనరుగారూ!" సమాచారసేకరణ కోసం జుబ్బారచయిత కొత్తదారులు వెతుక్కోసాగాడు. "వొకప్పుడు అనంతవీధీ, మంచాలవీధుల్లో వున్నట్టుగా యిండ్లముందర అన్ని వరండాలనూ కలిపే తిన్నే లిక్కడుండేవిగావనుకోండి! కోలావీధీ ఆకుతోట వీధుల్లాగా యిక్కడి గృహస్థులంతా వొకరి బతుకుల్లోకి యింకొకరు చొచ్చుకొచ్చి సామూహిక జీవనం చేసేవాళ్ళూ కారనుకోండి! అయితే యిండిపెండెంట్ యిండ్లల్లో వుండేవాళ్ళు. పదేండ్లకు ముందు మన తిరుపతికిగూడా 'డెవలపర్స్' అనే కొత్తజాతి మనుషులు వచ్చేశారు. వాళ్ళు పాతయిండ్లను నామరూపాలు లేకుండా చేసాశారు. ఆచోట్లలో గూళ్ళూ గుహల్లాంటి అపార్టుమెంటులుండే రెసిడెన్సీలు తీసుకొచ్చారు. యీ ఫోర్నాట్టూ లాయరు తనపాత యింటిని డెవలప్పర్స్‌కిచ్చేసి దానికి బదులుగా యీ ఫోర్నాట్టూతో బాటూ యింకో నెంబర్ని గూడా సంపాయించుకున్నాడు.."

"కలిసొచ్చేవాళ్ళకు అన్నీ కలిసొస్తాయి. వాళ్ళకేమో పాతిల్లుపోయి రెండు అపార్టుమెంటులొచ్చె... నాకేమో యేడెకరాలు పోయి వొక అపార్టుమెంటు మిగిలె..." యింటిగల్లాయిన తన స్వగతాన్నే పొడిగించాడు.

కింది అంతస్థులో లిఫ్టు "దయచేసి తలుపులు మూయండి... ప్లీజ్ క్లోజ్‌ది డోర్స్ ... థాంక్యూ ... దయచేసి తలుపులు..." అంటూ నిర్మోహంగా గొంతు తెరిచింది. నాలుగు నిముషాలు విరామం యిచ్చాక నాలుగో అంతస్థులోకొచ్చి నోరు తెరిచి మళ్ళీ అవే మాటల్ని అదే ధోరణిలో వల్లించసాగింది. వీపుకు యింజను అమర్చిన రాబోట్‌లా బరువైన సంచిని తగిలించుకున్న యువకుడు లిఫ్టులోంచీ బయటికొచ్చి "యిదేనా ఫోర్నాట్‌త్రీ! ఆబీగానికి తెరుచుకోవడం రాదా?" అని పలకరించాడు.

"ఆప్రశ్నతో వేగలేకే యీ కుర్చీల్లో సోలిపోయాం మేమిద్దరమూ! యిప్పుడు మీనెంబరు మూడు.. అయితే మూడోకుర్చీ యిక్కడలేదు.." జుబ్బారచయిత వరదులా సన్నటోయాడు.

"ముందుగా నా ప్రశ్నలకు జవాబులు చెప్పండి. నేనో యిన్వెస్టిగేటివ్ జర్నలిస్టును..." తన గుర్తింపుకార్డును దర్పంగా ముందుకు చూపాడు యువకుడు.

"చూశారా ఫోర్నాట్‌త్రీ వోనరుగారూ! యిదీ కలిసిరావడమంటే!" జుబ్బారచయిత ముందుకొస్తున్న యువకుడికేసి చేతినీ,ఇంటిగల్లాయినకేసి చూపుల్నీ నిగుడించాడు. "యీయిన్వెస్టిగేటివ్ జర్నలిస్టులు మా రచయితలకు వేలువిడిచిన రాతగాళ్ళు... యీ విలేఖరి యిక్కడికొచ్చాడూ అంటే మీకేదో కొత్త సమాచారం దొరుకుతుందనే అర్థం..."

"యీయన ఫోర్నాట్‌త్రీ వోనరా?" యింటిగల్లాయినను అనుమానంగా చూస్తూ ప్రశ్నించాడు విలేఖరి. "అయితే నా స్పెషల్ రిపోర్టును యీయన యింటర్వ్యూతోనే ప్రారంభిస్తాను. చెప్పండి వోనరుగారూ! యీ చిత్రలేఖ యెవరు? యెక్కడి నుంచీ వచ్చింది? యిప్పుడెక్కడి కెళ్ళివుంటుంది? మాయంగావడానికి కారణమెవరు?"

"యెవర్ని యేం ప్రశ్నలడుగుతున్నారు మీరు?" జుబ్బారచయిత యీసారి మనిషి నవ్వు నవ్వాడు. "ఫ్లాటు వోనరైనంత మాత్రాన పర్సనల్ విషయాల్లో తలదూర్చుతారా యెవరైనా? కథనువెతుక్కుంటూ వచ్చిన నేను చెప్పేవరకూ ఆమాయమైన స్త్రీకో పేరుందని గూడా యీయనకు తెలియదు.."

విలేఖరి వెంటనే ఫోర్నాట్టూ దగ్గరికెళ్ళి దాని కాలింగ్ బెల్‌చెవిని నులిమాడు. శబ్దంచేస్తూ తెరుచుకున్న తలుపుల రెక్కల మధ్యలోంచీ పొడుచుకొచ్చిన తలతో "నమస్తే మేడం! మీ ఫోర్నాట్ త్రీ ఫ్రెండు మీకోలెటరు పంపింది నాతో. సంతకం చేసి రిసీవ్ చేసుకోండి" అన్నాడు.

"ఫోర్నాట్ త్రీ నాకు ఫ్రెండా? నాకు లెటర్ రాసిందా? యింపాజిబుల్ ... యెక్కడి నుంచీ వచ్చిందా వుత్తరం? దాని ఫ్రం అడస్సు చూపెట్టండి ముందు" కోపంతో జేవురించిన పక్కింటావిడ ముఖం కాలుతున్న దిష్టి చిప్పలా కనలసాగింది.

తనతో మాట్లాడిన వ్యక్తి జుబ్బారచయితే అయినట్టుగా విలేఖరి అతడికేసి తిరిగి "ఫ్రం అడ్రస్సు డెడ్ లెటరా ఫీసులనుంచీ వచ్చే వుత్తరాలకెలా వుంటుంది?" అంటూ పొడుపు కథ పొడిచాడు.

"చచ్చిపొయ్యిందా? యెప్పుడు? యెక్కడ? నా బాడిగేమయ్యేటట్టురా దేవుడా?" యింటిగల్లాయిన శరీరమంతా గొంతే అయినట్టుగా పెద్దగా గొల్లుమన్నాడు.

"మాయమైన మనుషులు చచ్చి దెయ్యాలవుతారన్న మాట! యిదేదో హారర్ డిటక్టివ్ కథయ్యేటట్టుంది?" జుబ్బారచయిత వుత్సాహంతో కేరింతలు కొట్టాడు.

"చచ్చిపోయే ముందు నాకుత్తరం రాసిందా? యింపాజిబుల్.. నేనేమైనా అటార్నీనా? అంకంప్లీస్‌నా?" పక్కింటావిడ మాటల్ని రోషమూ కోపమూ సానబెట్టసాగాయి.

"గట్టుపైన పెరిగే చెట్లవేర్లు బావిలోకి దిగతాయి. ఫోర్నాట్ త్రీ విశేషాలు ఫోర్నాటూలోకి రాలేదంటే యెవరూనమ్మరు" విలేఖరి కోపంగా వురిమిచూశాడు.

"యీ అపార్టుమెంట్ల మధ్యలో కట్టిన గోడలెంత మందమో మీకు తెలియదు", తలుపుల్ని ముందుకు తోసిన పక్కింటావిడ తల రెక్కల్ని కదిలిస్తూ ముందుకొచ్చే మిడతలా యెగసిపడింది. "వొకరిప్రైవసీలోకి యింకొకరు దూరకుండా వ్యాక్యూమ్‌టైట్

గోడలున్నాయిక్కడ! కిటికీలు తెరిస్తే లోపలేసుకున్న యేసీ వృధా అవుతుందని జాగ్రత్త పడతాం. మాకున్న సమయం న్యూస్ పేపర్లు చదవడానికీ, టీవీ చూడ్డానికే చాలటంలేదు..”

కింది అంతస్థులోంచీ లిఫ్టు “దయచేసి తలుపులు మూయండి.... ప్లీజ్‌క్లోజ్‌దిడోర్స్... దయచేసి తలుపులు మూయండి” అని నిర్మోహపు గొంతెత్తి చెబుతోంది.

“చూశారా! ఆ వస్తున్నది పోలీసులే అయ్యుంటారు. దెయ్యాలకు వలేయడంలో వాళ్ళనుమించిన వాళ్ళెవరూ వుండరు..” విలేఖరి పరవశంగా చెప్పాడు.

“ఫ్లాటుకొని రెండు భూతాల్ని పోగొట్టుకొనిందానికి పరిహారంగా నేనిప్పుడీ నాలుగో భూతాన్ని భరించాల్సిందేనా? యిదేదో క్రిమినల్ కేసయి నా మెడకు చుట్టుకునేటట్టుంది...” యింటిగల్లాయిన లిఫ్టుకేసి భయం భయంగా చూశాడు.

“దెయ్యాలంటే యెంతయిష్టమో, పోలీసులంటే అంత భయంనాకు. నేను పారిపోతాను” అంటూ యెవరో వెనక తరుముతున్నట్టుగా పరిగెత్తిన జుబ్బారచయిత లిఫ్టు ముందు అయోమయంగా నిలబడ్డాడు.

దభేలుమని తెరుచుకున్న లిఫ్టు నోటిలోంచీ “యిదేనాఫోర్తుఫ్లోరు”? అన్న మాటతో బాటూ ప్రశ్నార్థపు గుర్తుపైన ఆశ్చర్యార్థకపు గుర్తును నిలబెట్టినట్టున్న యువకుడొకడు బయటికొచ్చాడు. తన మాటను వినిపించనివ్వకుండా “ప్లీజ్ క్లోజ్‌దిడోర్స్.. దయచేసి తలుపులు...”అంటూ అరిచిన లిఫ్టు గొంతును బలవంతంగా నొక్కేశాక “ఫోర్నాట్‌త్రీ యేవైపు?” అని మళ్ళీ తన గొంతు విప్పాడు.

“అయ్యయ్యో! మఫ్టీలో వుండే పోలీసులా మీరు?” అని అడుగుతూ జుబ్బారచయిత వెనక్కు పరిగెత్తాడు.

“అంతకంటే అప్రమత్తంగా నిఘా కాసేవాళ్ళం మేం..” అతను దారంతెగి సుడిగాలిలో విసురుకెళ్ళే గాలిపటంలా వుద్రేకంలో యెగసెగసి పడుతున్నాడు. “ప్రజాపరిజ్ఞాన పరియోజన లోకల్‌సెకరట్రీని నేను... ‘అర్లీబర్డ్ కాచెస్ ది వార్మ్’ అనేది మా మాటో! ప్రజా సమస్యల్ని మాకంటే ముందుగా మరెవరూ పట్టుకోలేరు. నిద్రపోతున్న ప్రజల్ని లేపి వుద్యోమాల్లోకి తోలటం మా లక్ష్యం... యీఫోర్నాట్ త్రీ ఆడమనిషి మాయమైనట్టు మాత్రమే మీకు తెలుసు. నిన్న ఆమె చెన్నయి హోటల్లో యెలా తేలిందో మీకెవరికీ తెలియదు. తెలిస్తే మీరింత శాంతంగా వుండలేరు. వున్నామేంవూరుకోనివ్వం!”

“అది మీకెట్లా తెల్సింది! ఐస్‌బ్రేక్ చేసి ముందుగా ఆ వార్తను విడుదల చేయబోయేది మేంకదా?” విలేఖరి ముఖం కోపంతో మండుతూ ప్రశ్నల నిప్పురవ్వల్ని విసరసాగింది.

“హోటల్ రిజిష్టర్లోంచీ ఆమె అడ్రస్సును మేం తెలివిగా పట్టేశాం! ఆమెది మర్డరో, సూయిసైడో తెలియక పోలీసులు గింజుకుంటూ వుండగానే మేం ఆ వేడిలో పెద్ద ప్రొటెస్టును మెటికులస్‌గా ప్లాన్ చేశాం! దాన్ని యీ అపార్ట్‌మెంట్లలో వుండే స్త్రీలతోనే ప్రారంభిస్తాం!” తనవెనక పెద్ద గుంపున్నట్టుగా ప్రజా పరిజ్ఞాన పరియోజన కార్యదర్శి చేతులు పెద్దగా తిప్పుతూ ఆవేశపడసాగాడు.

“మా అపార్టుమెంట్‌లో వుండే వాళ్ళంతా శాంతి ప్రియులు. అనవసరంగా గొడవలూ, వుద్యమాలూ చెయ్యరు.” పక్కింటావిడ తలుపుల రెక్కల్ని వూపుతూ కళ్ళుమిటకరించింది.

"అందరూ మీరెసిడెన్సీలో వుండేవాళ్ళలాగా యెవరిపనులు వాళ్ళు చేసుకుంటూ వుంటే యీలోకమెప్పుడో బాగుపడేది! వార్తల్ని యెప్పుడెలా సేకరించి యెవరికెలా అందించాలో చూసుకోడానికి మా అంతటి జర్నలిస్టులంమేంలేమా? మధ్యలో యిలాంటి అసోషియేషన్లూ, వుద్యమాలూ యెందుకు చెప్పండి?" విలేఖరి కోపంగా గర్జించాడు.

"మీరు జర్నలిస్టా? మేం యేవుద్యమాన్ని మొదలుపెట్టినా ముందుగా జర్నలిస్టులకే వివరాలు చెప్తాం... ప్రచారం ముందు, తర్వాత వుద్యమకారులూ, ఆ తర్వాత వుద్యమం, అదండీమా ఆర్డరు ..." ప్ర.ప.ప. కార్యదర్శి ముఖమంతా నవ్వుచేసుకుని కరచాలనం కోసం చేయి ముందుకు చాపాడు.

నీరసంగా తన చేతిని పాంటు జేబులోకి దోపేశాక "యీ చిత్రలేఖ వెనక వుద్యమాలు లేపేటంత తతంగమేమీ లేదు" అన్నాడు విలేఖరి.

"వార్తదేముంది సార్! అదెప్పుడూ విత్తనంలా చీమతలకాయంతే వుంటుంది. దాన్ని చిలికి చిలికీ మర్రి చెట్టులా పెంచడంలోనే వుంటుంది ప్రతిభ... యీ మనుషులు స్వార్థపరులైపోయారు. యీ సంఘం చెదలు పట్టిపోయింది. చిత్రలేఖ మరణం మొత్తం సమాజానికే గొడ్డలిపెట్టు. దీనికి కారణమైన యీ బూర్జువా పెట్టుబడిదారీ ప్రజాస్వామ్య ప్రపంచీకరణ వ్యవస్థను మేంవూరికే వదలం..." ప్ర.ప.ప. కార్యదర్శి బిగించిన పిడికిళ్లతో గాలిని బాదసాగాడు.

"చిత్రలేఖది మర్డరే అయితే వాళ్ళులాయర్ని వెతుక్కోవల్సిన అవసరంలేదులెండి! రెడీమేడ్గా పక్క అపార్టుమెంటులోనే క్రిమినల్ లాయర్ వున్నాడు" తన కథకు కావల్సిన డ్రామా దొరకడంతో జుబ్బారచయిత సింహపు నవ్వునవ్వాడు.

"పక్క అపార్టుమెంటుకేసు మరోలాయరు దగ్గరికి పోతే మాకు తలగొట్టేసినట్టుకాదా?" పక్కింటావిడ తల ముందుకూ వెనక్కూ వూగింది.

"మొత్తం యిరవయిలక్షల పెట్టుబడి... నెలబాడిగ అయిదువేలు.." కుర్చీలో సోలిపోయిన యింటిగల్లాయిన తలవంచుకుని గొణగసాగాడు.

కింది అంతస్థులో లిఫ్టు "దయచేసి తలుపుల మూయండి... ప్లీజ్క్లోజ్దిడోర్స్... థ్యాంక్యూ.. దయచేసి తలుపులు మూయండి... ప్లీజ్...." అంటూ రెండు భాషల్లో తనకున్న ప్రావీణ్యాన్ని నిరాసక్తంగా ప్రదర్శించసాగింది.

"మాఆయనేమో... ఆమెరాసిన లెటరేదో నాకివ్వండి... ఆయన దాన్ని ఫస్ట్విట్నెస్గా వాడు కుంటారు.." పక్కింటావిడ మురిపించే చూపులతో విలేఖరిని మోహరించింది.

"మా అసోషియేషన్ వాళ్ళే!..." ప్ర.ప.ప. కార్యదర్శి గంభీరంగా తలవూపాడు.

"యింటలిజెన్సు పోలీసులేమో!.." విలేఖరి తనకెమెరా సంచిని ప్రేమగా నిమిరాడు.

"యేసంబంధమూ లేకుండా నేనిక్కడికొచ్చానంటే యెవరూ నమ్మరు. నేను పారిపోతాను.." జుబ్బారచయిత యీసారి వుత్తరపు కిటికీదగ్గరికి పరిగెత్తాడు.

నాలుగో అంతస్థులో "దయచేసి తలుపులు మూయండి.. ప్లీజ్క్లోజ్దిడోర్స్... థాంక్యూ..." అంటూ లిఫ్టు అయిదుసార్లు హెచ్చరించాక, దానినోట్లోంచీ పాంటూ షర్టూ తొడుక్కున్న జులపాల జట్టు స్త్రీ తాపీగా బయటికొచ్చింది. రోజారంగు పౌడరుతో ముఖమూ, నల్లరంగులిప్స్టిక్తో పెదవులూ తడితడిగా మెరుస్తూండడంతో ఆమెయిప్పుడే

గుడ్డు వగల గొట్టుకొని బయటికొచ్చిన బెడసకోడిపిల్లిలా కనబడుతోంది. ట్రాలీ సూట్‌కేసును లాక్కుంటూ, హైహీలు చెప్పుల్ని టకటక లాడించుకుంటూ, తెరపైన కదిలే కార్టూను బొమ్మలా నడుస్తూ, ఆమె ఫోర్త్నాట్‌త్రీ ముందు కొచ్చి ఆగింది. తన వానిటీ బాగ్‌లోకి చేయిపెట్టి కెలికాక" డామిట్! వాట్ హాపెన్డ్ టూ మై కీస్?" అనివాపోయింది.

"గుడీవనింగ్ మేడమ్! ఆర్యూ ఫ్రం యింటలిజెన్స్?.." విలేఖరి తన కెమరా సంచి జిప్ లాగుతూ అడిగాడు.

గొంతుక్కూచుని వానిటీ బాగ్ నలాగే కిందదిమ్మరిస్తూన్న ఆగంతకురాలు తలపైకెత్తి చీకాకుగా చూసి "నేనా? బెంగుళూరు నుంచీ" అంది.

వానిటీ బాగ్ లోంచీ కిందికి రాలిన వస్తువులకేసి ఆశగా చూస్తూ "లిప్ స్టిక్కులూ, ఐబ్రోపెన్సిల్లూ, క్లిప్పులూ, పౌడరుటిన్నులూ, ఐలైనర్లూ" అని పక్కింటావిడ జాబితా చదివింది.

"వాటిలోపల కెమెరాలూ, రికార్డు ప్లేయర్లూ, గన్లూ వుంటాయేమో!" జుబ్బారచయిత బెదురుతూ వెనకకడుగేశాడు.

ఆగంతకురాలు నడవాలో నిల్చున్నవ్యక్తులనంతా విసుగ్గా చూశాక ఫోర్త్నాటూ కేసి తిరిగి" మీఫ్లాట్లో హామెరో, రాడ్డో వుంటే యివ్వండి. యీబ్లడీ లాక్‌ను పగలగొట్టేస్తాను" అంది.

"అయ్యయ్యో! బీగం పగలగొడతారా మేడం?" యింటిగల్లాయిన పైకిలేచి చేతులు అడ్డంగా తిప్పుతూ గొల్లుమన్నాడు "కార్పెంటర్‌తో గూడా వూరంతా వెతికి దాన్ని తెచ్చిబిగించినాను. కొడితే తలుపులు పగలాల్సిందే గానీ బీగం వూడదని ఆ అంగిడోడు దెబ్బేసి చెప్పినాడు.."

"మీ బీగాన్ని యెవరు పగలగొట్టినా మేం వొప్పుకోంలెండి వోనరుగారూ! యెంత యింటలిజెన్స్ వాళ్ళే అయినా డిసీస్డ్ పర్సన్ యింటిలోకి వెళ్ళాలంటే లాయరూ, ఆర్మ్‌డ్ పోలీసులూ, జర్నలిస్టులూ తోడుండాలి" తన కెమరా సంచిని చూపెడుతూ విలేఖరి బరోసా యిచ్చాడు.

జుబ్బారచయిత అందర్నీ వోసారి నవ్వుతూ చూశాక ముందుకొచ్చి "మిమ్మల్ని వీళ్ళు యింటలిజెన్స్ ఆఫీసరని పొరబడ్డారు మేడమ్! మీరు పొరబాటున వేరే ఫ్లాటు దగ్గరికొచ్చినట్టున్నారు. యీ ఫోర్త్నాట్ త్రీ చిత్రలేఖ నిన్నసాయింత్రం చెన్నయిలో చనిపోయింది" అన్నాడు.

ఆవిడ కాస్సేపు అందర్నీ కళ్ళార్ప కుండా చూశాక "డామిట్! మీకేమయ్యింది? యీ ఫోర్త్నాట్ త్రీ నాదే!" అని పెద్దగా అరిచింది.

పక్కింటావిడ తలను తలుపుల వెనక్కు లాగేసుకుంది. జుబ్బారచయిత లిఫ్టుకేసి గెంతాడు. చేతుల్లోంచీ జారిపోతున్న కెమెరా సంచిని విలేఖరి గబాలున పట్టుకున్నాడు. ప్ర.వ.వ. కార్యదర్శి హైహీలు చెప్పుల్లో యిరుక్కున్న ఆగంతుకురాలి పాదాల్ని మిర్రిమిర్రీ చూశాడు.

"నీపేరేందో నాకనావస్యం! కానీ నా అపార్టుమెంటులో రెంటుకుండే ఆడమనిషి మాత్రం నువ్వు కానేకాదు. రెండు సంవత్సరాలకు ముందు నా కగ్రిమెంటురాసిచ్చి

అడ్వాన్సు కట్టిన మనిషి నాకింకా బాగా గెవనముండాది" వెంకట్రాయలు భూతమాంత్రికుడిలా కోపంతో వూగి పోసాగాడు.

ఆగంతకురాలు తాపీగా ప్లాస్టిక్ కుర్చీలో కూర్చుని, తనముఖంపైన పొటమరించిన చెమట ముత్యాల్ని రూమాలుతో చిదుపుతూ "మీరేనా ఫోర్నాట్రీ వోనరు? మిమ్మల్నెప్పుడూ చూడలేదు నేను." అంది. "మీకు అగ్రిమెంటు రాసిచ్చిన చిత్రలేఖకు సంవత్సరానికి ముందు ట్రాన్స్‌వరయ్యింది. ఆప్లేసులో నాకు పోస్టింగయ్యింది. ఆమె యీ వూరొదిలి పోతూ యీ అపార్టుమెంటులో నన్నుండిపొమ్మంది. ఆమె మీకిచ్చిన అడ్వాన్సు నే నామెకు పే చేసినాను. రెంటు ప్రతినెలా బ్యాంకులో ఆమె యిచ్చిన అకౌంటులో వెయ్యమని చెప్పింది".

"నాకు తెలియకుండా సబ్ అగ్రిమెంటు చేసుకున్నారా మీరు? నేనొప్పుకోను" యింటిగల్లాయిన గింజుకున్నాడు.

"మా పక్క ఆఫీసులో పనిచేస్తూ మాయమైపోయినామెను నేను కాజువల్‌గానే చూసినా అన్నీ కరెక్టుగా జ్ఞాపకం పెట్టుకున్నాను మేడం! ఆమెది పొడుగ్గా వాలుజడ. చీర కట్టుకునేది. మా వూర్లో యిలా పాంటూషర్టూ వేసుకునే ఆడవాళ్ళెవరూ లేరు. ఆమె పెద్ద బొట్టుగూడా పెట్టుకునేదని గుర్తు..." జుబ్బారచయిత తన జ్ఞాపకశక్తిని ప్రదర్శించాడు.

"నా హజ్బెండుకు నేనలాగుండడం నచ్చదు..." పాంటూషర్టూయువతి విసుగ్గా అడ్డుతగిలింది.

"యీయింట్లో వుండిన టినెంటు డైవోర్సీ అని మాకు తెలుసు. ఆమాత్రం డేటా సేకరించుకోకుండా యిన్వెస్టిగేషను మొదలుపెడతానా నేను?" ఆమె మాటలతో పోటీబడుతున్నట్టుగా విలేఖరి విరుచుకుపడ్డాడు.

"డైవోర్సీలయితే మళ్లీ కలుసుకోగూడదా?" పాంటూషర్టూయువతి మరింత విసురుగా ప్రశ్నించింది.

"అప్పుడు పెద్దపెద్ద కారణాలతో పోట్లాడుకొని విడిపోయి వుంటారు. యిప్పుడిలా చిన్న చిన్న విషయాల్లో గూడా సర్దుకు పోతున్నారు. అంతేగదండీ?" జుబ్బాయువకుడు తన సృజనాత్మకతకు మురిసిపోసాగాడు.

"వాళ్ళ ఆఫీసుకు లీవులెటరైనాలేదని వార్తల్లో రాశారు..." తన తలను తలుపుల ముందుకు జరిపుతూ పక్కింటావిడ తన పొలకువను గమనించేలా చేసింది.

"బహుశా వాళ్ళ హజ్బెండు వుద్యోగం చేయొద్దని ఆర్డరేసి వుంటాడు. యిప్పుడుమళ్లీ మనసుమార్చుకుని వుంటాడు. యేదైనా డబ్బు అవసరం వచ్చివుంటుంది. అప్పుడు వుద్యోగం అవసరమూ తెలిసి వుంటుంది." జుబ్బారచయిత తన వూహాగానాన్ని కొనసాగించాడు.

"అయితే నిన్న చెన్నయిలో కనిపించిన ఆశవమెవరిది?" విలేఖరి తన కెమరా సంచిని వీపుకు తగిలించుకుంటూ అడిగాడు.

"ఆమె యీ అపార్ట్‌మెంటు అడ్రస్సేయిచ్చింది" ప్ర.ప.ప. కార్యదర్శి మరోసారి పిడికిలి బిగించాడు.

పాంటూషర్టూయువతి కాస్సేపు బిత్తర చూపులు చూశాక "మైగాడ్! చిత్రలేఖది గాదుగదా" అని కేకేసింది.

ప్ర.వ.ప. కార్యదర్శి కాస్సేపు గాలిలో చూపుల్ని వేలాడేశాక వెనుదిరిగి లిఫ్టుదగ్గరికి నడుస్తూ" యీసరికి మా చెన్నయి బ్రాంచీవాళ్ళు ఆ చిత్రలేఖ ప్రస్తుతముండే అడ్రస్సు కనిపెట్టి అక్కడే పుద్యమాన్ని రేపేశారేమో! బ్రహ్మాండమైన అవకాశ మొకటి వచ్చి అంతలో చేజారి పోయింది. యీ వూరికి విముక్తి లేదు. రాదు" అని శపించాడు.

విలేఖరి కెమెరా బరువుతో ముందుకు వంగి" బాడ్‌లక్! రేపీసరికి యీ వూరును కొత్తవార్తతో వూపి పారేసుండేవాణ్ణి! మీరు కనీసం రేపు సాయంత్రమైనా రాగూడదా!" అని పాంటూషర్టూయువతిని కసిరాడు.

"దయచేసి తలుపులు మూయండి.. ప్లీజ్‌క్లోజ్‌దిడోర్స్... థాంక్యూ!" అని నిర్లక్ష్యంగా లిఫ్టు అరుస్తూండగా విలేఖరి దానికేసి తిరిగాడు.

ఫోర్నాట్టూ తలుపుల మధ్యలోంచీ "జర్నలిస్టుగారూ! ఆవుత్తరమేదో నాకిచ్చేసి వెళ్ళండి" అని బ్రతిమాలింది పక్కింటావిడ తల.

అప్పటికే ప్ర.ప.ప. కార్యదర్శికి నీడలా లిఫ్టు నోటిలోకి దూరేసిన విలేఖరి గొంతెత్తి" నేనలా చెప్పకుంటే మీరు జవాబు చెప్పేవాళ్ళా చెప్పండి?" అని రెట్టించాడు.

జుబ్బారచయిత ఖాళీగా వున్న రెండో కుర్చీలో కూర్చుని "వొకే ఆఫీసులో పని చేస్తున్నా నేను మిమ్మల్ని గుర్తుపట్టలేక పోయాను. పక్క అపార్టుమెంటావిడ గూడా పోల్చుకోలేకపోయారు. మీ ప్లాటు వోనరు మిమ్మల్ని యిప్పుడే మొదటిసారిగా చూశాడు. యీ కొద్దికాలంలో మీలోయింత మార్పెలా వచ్చింది?" అని నెమ్మదిగా అడిగాడు.

కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లు తుండగా, కింది పెదవిని మునిపంటితో గట్టిగా నొక్కిపట్టుకుంటూ, పాంటూషర్టూ యువతి వురిమిచూసింది.

"నా నాలుగు నెలల బాడిగ" యింటిగల్లాయిన మరచిపోయిన విషయాన్ని మళ్లీ జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

"నా ప్లాస్టిక్ కుర్చీలు..." పక్కింటావిడ తల అసహనంగా వూగింది.

"డబ్బులు యింట్లోపలవున్నాయి... ఆవాచ్‌మెన్‌ను పిలిచి బీగం పగల గొడితేనే మీకు రెంటు" అంటూ పైకిలేచి కుర్చీని ఫోర్నాట్టూకేసి తోసింది పాంటూషర్టూయువతి. జుబ్బా రచయిత తాను ఖాళీ చేసిన కుర్చీని పక్కకు జరిపాడు.

పక్కింటావిడ తల పక్క నుంచీ ఫోర్నాట్టూ తలుపులకు మొలిచిన చేతులు కుర్చీలను లోపలకు లాక్కున్నాయి.

"నా అపార్టుమెంటులోకి కొత్త మనిషి వచ్చి చేరిందనే మాటే ఆవాచ్‌మేన్‌గాడు చెప్పలేదు. అసలు యింతకు ముందుండిన వాచ్‌మేన్‌గాడే యిప్పుడువుండాడా? కొత్తోడేమైనా చేరినాడా? యేవాచ్‌మేన్నుగానీ పట్టుమని పదినెలలు వుండనీరుగదా యీ అపార్టుమెంట్లులో? యిప్పుడు వాడెవుడో తెలుసుకోని, వాన్నెతికి పట్టుకోని రమ్మని మొండి గుచ్చుంటావేంది నువ్వు? వాడు దొరక్కపోతే బీగాలు రిపేరు జేసే మనిషినయినా తొడుక్కోనొస్తానుండు. నువ్వీలోపల జారుకోవద్దు... మళ్లా నిన్ను వెతికి పట్టుకోలేను..."

యింటిగల్లాయిన మాట్లాడుతూ వుండగానే లిఫ్టు గొంతుతెరిచి "ప్లీజ్ క్లోజ్‌ది డోర్స్... థాంక్యూ ..." అంటూ యిదివరకూ ఆపిన చోటు నుంచీ మాటల్ని వుదాసీనంగా మొదలుపెట్టింది.

"మేడమ్! మీరు నాప్రశ్నలకు జవాబులు చెప్పలేదు.. యింతకూ మీ పిల్లలెక్కడ? వాళ్ళకోసమే మీరిప్పుడు మీ హజ్బెండుతో సర్దుకు పోతున్నారా?" అంటూ జుబ్బారచయితకూడా తాను అడిగిన ప్రశ్నల్నే మళ్ళీ అడగబోయాడు.

"స్టాపిట్! నన్నడగడానికి మీరెవరు? మీకునేనెందుకు జవాబు చెప్పాలి? మర్యాదగా పోతారా లేకపోతే పోలిసురిపోర్టివ్వమంటారా?" పొంటూ షర్టూ యువతి శక్తినంతా గొంతులోకి తెచ్చుకుని నిలువెల్లా వూగిపోతూ అరిచింది. జుబ్బా రచయిత పైకిలేచి, ఆమెకేసి చూస్తూ వెకిలిగా నవ్వబోయాడు. ఆ తరువాత లిఫ్టుకేసి తిరగబోయినవాడల్లా ఆగి "అయితే యీ అపార్టుమెంటులో రెండు సంవత్సరాలకుముందు బాడుగకుండిన ఆ చిత్రలేఖ యెందుకు చనిపోయింది? యింతకూ అది మర్డరా? నేచురల్‌డెత్తా? హోటల్లో దిగినప్పుడు రికార్డులో యీపాత అడ్రస్సెందుకు రాసింది? ఆమె అసలు వూరేది? పెళ్ళయిందా? ఆమె కథేమిటి?" అని తనను తాను ప్రశ్నించుకుంటున్నట్టుగా అడిగాడు.

పొంటూ షర్టూ యువతి గర్జిస్తున్నట్టుగా పెద్దగా మూలిగాక "వైషుడ్ ఐనో ఆన్సర్స్ టూ ఆల్‌దోస్ డామ్న్ కొసెన్స్? ఆనానా చెత్త విషయాలు నేనెందుకు తెలుసుకోవాలి?" అని గొంతెత్తి మెగాఫోన్లా అరిచింది.

జుబ్బా రచయిత వడివడిగా పిల్లిలా లిఫ్టులోకి వురికాడు.

"నా సంగతులు పట్టించుకోటానికే నాకు టయిం చాలటంలేదు" పొంటూ షర్టూ యువతి గొణిగిన మాటల్ని వినబడనీయకుండా "దయచేసి తలుపులు మూయండి...ప్లీజ్‌క్లోజ్‌దిడోర్స్... థాంక్యూ! దయచేసి..."అంటూ లిఫ్టు కాస్సేపు నిరాసక్తపు ప్రకటనను ప్రసారంచేసి ఆ తరువాత టక్కున గొంతు నొక్కేసుకొంది.

యెడారిపాయలా కనబడుతున్న అపార్టుమెంట్ల నడవాలో, అమావాస్యలా పరచుకున్న వొంటరి తనంలో, పొంటూ షర్టూ యువతి ఫోర్నాట్ త్రీ బీగాన్ని ముసలినక్షత్రాన్ని చూస్తున్నట్టుగా చూస్తూకూర్చొంది.

**(పాలపిట్ట, మార్చి 2010)**